# ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com


పోలవరం-బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి: కవిత

2


నవంబర్ 5 గురువారం 2026 | సంపుటి : 1 | సంచిక : 27 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

THURSDAY NOVEMBER 5 2026 | VOL:1 | ISSUE: 27 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM


## “డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తా”.. ఎన్నికల ఫలితాలతో స్వరం మార్చిన ట్రంప్



అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఓటర్లు రిపబ్లికన్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పారు. ఎన్నికల ఫలితాలకు ముందు వరకు డెమోక్రాట్లు ప్రవేశపెట్టే ప్రతీ బిల్లును వీటో చేస్తానని గర్జించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఘోర పరాజయం తర్వాత అనూహ్యంగా స్వరం మార్చారు. దేశ శ్రేయస్సు కోసం డెమోక్రాట్లతో కలిసి పనిచేయడానికి సిద్ధమని ప్రకటించారు. “ఈ ఎన్నికల్లో నేను బ్యాలెట్‌పై లేను, ఒకవేళ ఉండుంటే మేము భారీ మెజారిటీతో గెలిచేవాళ్లం” అని వ్యాఖ్యానించారు ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు అంచనాలకు మించి ప్రతినిధుల సభ (హౌస్), సెనెట్ రెండింటినీ కైవసం చేసుకోవడంతో ట్రంప్ ఈ మేరకు దిగిరాక తప్పలేదు. ఎన్బీసీ న్యూస్ అంచనాల ప్రకారం, 435 స్థానాలున్న ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు 256 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది. అదేవిధంగా, 100 మంది సభ్యులున్న సెనెట్‌లో కనీసం 54 స్థానాలు దక్కించుకుని స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించారు. ధరలు తగ్గిస్తానని, ప్రజల జీవితాలను సులభతరం చేస్తానని 2024 ఎన్నికల్లో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన ట్రంప్, ఆ తర్వాత ఆ హామీలను పక్కనపెట్టారు. అమెరికాను గొప్పగా మార్చేందుకు టారిఫ్‌లు విధిం‌డం, ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు కోసం యుద్ధానికి దిగడం, వైట్‌హౌస్ సుందరీకరణ వంటి భారీ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ఇవే ఆయన పట్ల ప్రజాగ్రహానికి కారణమయ్యాయి.రిపబ్లికన్లకు కంచుకోటలైన టెక్సాస్, కాన్సాస్, దక్షిణ కరోలినా వంటి రాష్ట్రాల్లో పార్టీ ఓటమి పాలుకావడం

(మిగతా 2వ పేజీలో..)

# సదర్ వేడుకల్లో సీఎం రేవంత్.. యాదవులకు కీలక హామీలు

### సదర్‌ను అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వం

### వేడుకల నిర్వహణకు రూ.5 కోట్ల నిధులు కేటాయింపు

### హైదరాబాద్‌లోని గోల్కొండ ఒకనాటి గొల్లంకొండ అని రేవంత్ వ్యాఖ్య



సదర్ సమ్మేళనం కేవలం యాదవ సోదరుల పండుగే కాదని, అది తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవ సమ్మేళనమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన సదర్ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై యాదవ సోదరులకు శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాదవుల చిరకాల కోరికను నెరవేరుస్తూ.. సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. వేడుకల నిర్వహణ కోసం రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.గతంలో ఏ ముఖ్యమంత్రీ సదర్‌ను రాష్ట్ర పండుగగా ప్రకటించే ఆలోచన చేయలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని నేటి గోల్కొండ కోట ఒకనాటి ‘గొల్లంకొండ’ అని, నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకమని కొనియాడారు. తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం కల్పించామని, అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యే పదవి ఇచ్చామని గుర్తుచేశారు. యాదగిరిగుట్ట

(మిగతా 2వ పేజీలో..)

## డీప్‌టెక్‌తో తెలంగాణకు ప్రపంచస్థాయి గుర్తింపు: భట్టి



### 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం

### పరిశోధనలు ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులుగా మారాలి

### యువతకు విస్తృత ఉపాధి అవకాశాలే లక్ష్యం

**హైదరాబాద్, నవంబరు 4 :**

తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది, ప్రపంచస్థాయి టెక్నాలజీ హబ్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో డీప్‌టెక్, సాంకేతిక ఆవిష్కరణలు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. బుధవారం బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో నిర్వహించిన ఎఫ్ఐసీసీఐ శతాబ్ది వేడుకలు, తెలంగాణ డీప్‌టెక్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పరిశోధనలు ప్రయోగశాలలకే

(మిగతా 2వ పేజీలో..)

## కండక్టర్ ప్రవళిక కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం: మంత్రి పొన్నం



### ప్రయాణికురాలి దాడిలో గాయపడిన మహిళా కండక్టర్ ప్రవళిక మృతి

### మృతురాలి తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని పొన్నం హామీ

ప్రయాణికురాలి దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన టీజీఎస్ఆర్టీసీ మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం, ఆర్టీసీ తరఫున కలిపి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక మృతదేహానికి మంత్రి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద అక్టోబర్ 25న ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. టికెట్ డబ్బుల చిల్లర విషయమై ప్రయాణికురాలు మౌనికతో జరిగిన గొడవలో... ప్రవళికను కదులుతున్న బస్సు నుంచి కిందకు తోసేయడంతో ఆమె వెనుక చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. పది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న రాత్రి ఆమె కన్నుమూశారు. ఈ ఘటనపై ఇప్పటికే నిందితురాలైన ప్రయాణికురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

(మిగతా 2వ పేజీలో..)

## సోషల్ మీడియాలో కాదు.. దమ్ముంటే సభలో చర్చకు రండి: రాహుల్‌కు నిర్మల సవాల్

### మోదీ బహిరంగ చర్చకు రావాలన్న గాంధీ

### ఘాటుగా స్పందించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

### చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని స్పష్టీకరణ

### ఆధారాలతో చర్చకు వచ్చి, ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించాలని సూచన



బహిరంగ చర్చకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిద్ధమా? అంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని, సోషల్ మీడియా కాదని తేల్చిచెప్పారు. ఈ మేరకు తన ‘ఎక్స్’ ఖాతాలో రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె వరుస పోస్టులు చేశారు. “రాహుల్ జీ, చర్చకు వేదికను ఎంచుకోమని మీరు ప్రధానిని కోరుతున్నారు. దానికి ఇప్పటికే ఒక వేదిక ఉంది, అదే పార్లమెంట్. దానికి మీరే ప్రతిపక్ష నాయకుడిగా

(మిగతా 2వ పేజీలో..)

## తమిళ సినీ పరిశ్రమకు సీఎం విజయ్ ప్రభుత్వం గుడ్ న్యూస్.. ఇకపై రోజుకు 6 షోలు!

### తమిళనాడులో కొత్త సినిమాలకు రోజుకు 6 షోలకు అనుమతి

### రిలీజైన మొదటి వారం పాటు వర్తించనున్న కొత్త నిబంధన

### సీఎం జోసెఫ్ విజయ్ అధ్యక్షతన ప్రభుత్వం కీలక ఉత్తర్వుల జారీ



### ప్రభుత్వ నిర్ణయంపై తమిళ సినీ పరిశ్రమ హర్షం

తమిళ సినీ పరిశ్రమకు అక్కడి ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. రాష్ట్రంలోని థియేటర్లలో కొత్తగా విడుదలయ్యే తమిళ చిత్రాలకు రోజుకు ఆరు షోలు ప్రదర్శించుకునేందుకు

(మిగతా 2వ పేజీలో..)

# రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే: పొంగులేటి

### వచ్చే ఏడాదిలోగా రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే

### అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ

### పక్కా హద్దులతో కొత్త పాస్‌బుక్కుల జారీ

### 22-ఏ భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు



**హైదరాబాద్, నవంబరు 4 :**

వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమికి సమగ్ర సర్వే నిర్వహిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. భూ సర్వేలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే నిర్వహించాలని, భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ తరహాలో భద్రతతో కూడిన భూ రికార్డులు అందిస్తామని తెలిపారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా భూ సర్వే, రెవెన్యూ అంశాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి అధికారులకు

(మిగతా 2వ పేజీలో..)

## ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు: కేటీఆర్ ఘాటు విమర్శలు

### కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ ఘాటు విమర్శలు

### కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ, బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు

### తెలంగాణకు కేంద్రం ఏం ఇచ్చిందని అమిత్ షాను ప్రశ్నించిన కేటీఆర్

### రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై విమర్శలు

కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న పార్టీలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర



(మిగతా 2వ పేజీలో..)

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

# సదర్ వేడుకల్లో సీఎం రేవంత్.. యాదవులకు కీలక హామీలు

మొదటి పేజీ తరువాయి)

దేవస్థానం బోర్డు సభ్యురాలిగా ఈశ్వరమ్మ యాదవ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో విజయవంతంగా నిర్వహించిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, రాబోయే రోజుల్లో యాదవులకు న్యాయమైన వాటా దక్కేలా చూస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. యాదగిరిగుట్టలో గోసంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మూసీ పునరుజ్జీవం, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి ప్రాజెక్టులకు యాదవ సోదరులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు: కేటీఆర్ ఘాటు విమర్శలు

మొదటి పేజీ తరువాయి)

నేతలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు.అమిత్ షా హైదరాబాద్‌కు వస్తే బండి సంజయ్ బాడీగార్డ్‌లా వ్యవహరించారని కేటీఆర్ విమర్శించారు. ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికారు. తనకంటే చిన్నవాడైన అమిత్ షాకు రాంచందర్‌రావు కాళ్లకు నమస్కరించడమేంటని ప్రశ్నించారు. అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని, రాష్ట్రానికి ఏం ఇచ్చారని కేటీఆర్ నిలదీశారు. ఒక్క మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా విద్యాసంస్థనైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసమే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళుతూ ఆయన 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా మారిపోయారని ఎద్దేవా చేశారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్లుగా.. భూములు అమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో అలా ఉందని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

## పోలవరం-బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి: కవిత

### చంద్రబాబుకు రేవంత్ రెడ్డి గురుదక్షిణ ఇస్తున్నారన్న కవిత

### నదీ జలాల వినియోగంపై ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని విమర్శ

### పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని సూచన



పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదీ జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని, ఈ విషయం ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాలతో మరోసారి బహిర్గతమైందని ఆమె విమర్శించారు.ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో రాష్ట్ర అధికారులు గోదావరి – కావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ నుంచి చేపట్టాలని కోరుతుంటే... మరోవైపు కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సమ్మతి తెలపడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కవిత ఆరోపించారు.ఈప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని, 2024లోనే తెలంగాణ జాగృతి తరఫున తాము దీనిని వ్యతిరేకించామని గుర్తుచేశారు. "రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన 250 టీఎంసీల గోదావరి జలాలను సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు 'గురుదక్షిణ'గా చెల్లించుకుంటున్నారు" అని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని కవిత హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం జరిపే అన్ని సంప్రదింపుల నుంచి తెలంగాణ తక్షణమే వైదొలగాలని, ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వెంటనే లేఖ రాయాలని ఆమె డిమాండ్ చేశారు.

## కేసీఆర్‌కు పేరు వస్తుందనే నీళ్లివ్వడం లేదు: వేముల ప్రశాంత్ రెడ్డి

తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్నది కాలం తెచ్చిన కరవు కాదని, ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిపెట్టిన కరవని ఆయన విమర్శించారు. పలువురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలతో కూడిన ప్రతినిధి బృందం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించింది. ఈ సందర్భంగా బ్యారేజీ స్థితిగతులను, నీటి లభ్యతను వారు పరిశీలించారు.అనంతరం వేముల ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. బ్యారేజీ వద్ద పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఉద్దేశపూర్వకంగా సముద్రం పాలు చేస్తున్నారని మండిపడ్డారు. నిత్యం సుమారు 22,000 క్యూసెక్కుల నీరు వృథాగా పోతోందని, ఈ నీటిని పంపింగ్ చేస్తే రైతుల పంటలను కాపాడవచ్చని ఆయన అన్నారు.బ్యారేజీ కూలిపోయిందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, 85 పిల్లర్లు పటిష్ఠంగానే ఉన్నాయని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటిని ఎత్తిపోయకపోతే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో పెద్ద ఎత్తున 'రైతు పోరుబాట' నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## డీప్‌టెక్‌తో తెలంగాణకు ప్రపంచస్థాయి గుర్తింపు: భట్టి

మొదటి పేజీ తరువాయి)

పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులుగా రూపాంతరం చెందాలని సూచించారు.

డీప్‌టెక్ అభివృద్ధికి హైదరాబాద్‌లో అవకాశాలు

డీప్‌టెక్ రంగం అభివృద్ధికి హైదరాబాద్‌లో అపారమైన అవకాశాలు ఉన్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, బయోటెక్, ఏరోస్పేస్ రంగాలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రం ముందుకు సాగుతోందని వివరించారు. పరిశ్రమలు, పరిశోధకులు, ప్రభుత్వ శాఖలు పరస్పర సహకారంతో పనిచేసినప్పుడే ఆవిష్కరణలకు తగిన ఫలితాలు వస్తాయని చెప్పారు. యువ స్టార్టప్‌లకు ఉమ్మడి పరీక్షా కేంద్రాలు, సులభతర ధ్రువీకరణ విధానాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త ఆవిష్కరణలకు ప్రభుత్వం, పరిశ్రమలు అండగా నిలవాలని, విజయవంతమైన ప్రయోగాలను విస్తృత స్థాయిలో అమలు చేయాలని సూచించారు.

విద్యుత్, వైద్య, వ్యవసాయ రంగాల్లో ఆవిష్కరణలు

పునరుత్పాదక విద్యుత్ వినియోగం, విద్యుత్ నిల్వ, స్మార్ట్ గ్రిడ్ వ్యవస్థల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వైద్య రంగంలో వ్యాధులను ముందుగానే గుర్తించే అధునాతన పరికరాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. వ్యవసాయ రంగంలో రైతులకు తక్కువ ఖర్చుతో ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. కొత్త ఉత్పత్తుల రూపకల్పన దశ నుంచే సామాన్యులకు అందుబాటు ధరల్లో వాటిని అందించే అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలని తెలిపారు.

యువతకు ఉపాధి.. పరిశ్రమలకు సాంకేతిక చేయూత

డీప్‌టెక్ రంగం యువతకు విస్తృత ఉపాధి అవకాశాలను కల్పించగలదని భట్టి విక్రమార్క అన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఉత్పాదకత పెంపునకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దోహదపడాలని పేర్కొన్నారు. ఆవిష్కరణల ఫలితాలు ప్రజల ఆదాయాల పెరుగుదల, మెరుగైన ప్రభుత్వ సేవలు, కొత్త ఉద్యోగాల రూపంలో కనిపించాలని స్పష్టం చేశారు. భారతీయ ఆలోచనలు, సాంకేతిక ఆవిష్కరణలు ప్రపంచస్థాయి పారిశ్రామిక సంస్థలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనకు ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే: పొంగులేటి

మొదటి పేజీ తరువాయి)

పలు సూచనలు చేశారు.

వివాదరహిత భూములకు కొత్త పాస్‌బుక్కులు

భూములపై వివాదాలు లేకుండా స్పష్టమైన హద్దులతో కొత్త పాస్‌బుక్కులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పొంగులేటి తెలిపారు. సర్వే నిర్వహిస్తున్న గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు వారానికోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే పురోగతిని పరిశీలించాలని సూచించారు. సుమారు 125 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో భారీ స్థాయిలో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని పేర్కొన్నారు. సర్వే నంబర్లలో నమోదైన వివరాలకు, వాస్తవంగా రైతుల స్వాధీనంలో ఉన్న భూములకు మధ్య ఉన్న తేడాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

సరిహద్దు వివాదాల పరిష్కారంపై దృష్టి

పట్టా భూములు, వాటి హద్దులకు సంబంధించిన వివాదాలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించాలని మంత్రి సూచించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న సరిహద్దు వివాదాల పరిష్కారానికి సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యలను అధికారుల సమక్షంలోనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను దాచకుండా వాస్తవాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

22-ఏ భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు

22-ఏ జాబితాలో ఉన్న భూములకు సంబంధించిన సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పొంగులేటి అధికారులను ఆదేశించారు. ప్రజలను అనవసరంగా ఇబ్బందులకు గురిచేసే అధికారులపై తక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూ సర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## "డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తా".. ఎన్నికల ఫలితాలతో స్వరం మార్చిన ట్రంప్

మొదటి పేజీ తరువాయి)

ఆయన అంచనాలను తీవ్రంగా దెబ్బతీసింది. కాన్సాస్‌లో 95 ఏళ్ల రిపబ్లికన్ల గుత్తాధిపత్యానికి తెరదించుతూ డెమోక్రాట్ అభ్యర్థి ఆడమ్ హామిల్టన్ సెనెటర్‌గా గెలిచారు. టెక్సాస్ గవర్నర్‌గా హినా హినోజోసా ఎన్నికవడంతో 36 ఏళ్ల రిపబ్లికన్ పాలనకు ముగింపు పడింది. ట్రంప్ స్వయంగా ఎంపిక చేసిన అభ్యర్థులు సైతం ఓడిపోవడం ఆయనకు వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బ. ఈ ఓటమితో పార్టీపై ట్రంప్ పట్టు సడలుతుందని, ఆయనను వ్యతిరేకించే వారి సంఖ్య పెరుగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధ్యక్షుడిగా మిగిలిన రెండేళ్లలో ఆయన దూకుడుకు కళ్లెం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఫలితాల తర్వాత 'పొలిటికో'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "రెండేళ్ల పాటు ప్రతీదాన్నీ వీటో చేస్తూ కూర్చోవాలని నేను అనుకోవడం లేదు. దేశానికి మంచి జరిగేలా చూసేందుకు డెమోక్రాట్లతో కలిసి పనిచేస్తాం" అని తెలిపారు. అయితే, డెమోక్రాట్లు మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. ప్రతినిధుల సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టనున్న హకీమ్ జెఫ్రీస్ మాట్లాడుతూ, "మేము కీలకమైన మార్పులు తీసుకురావాల్సి ఉంది. ఇప్పుడున్న వ్యవస్థలు సరిగా లేవు. అమెరికా ప్రజలకే ప్రాధాన్యత ఇచ్చే కాంగ్రెస్ కావాలి" అని స్పష్టం చేశారు. దీంతో రాబోయే రెండేళ్లలో ట్రంప్ పాలన ఎలా సాగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

## సోషల్ మీడియాలో కాదు.. దమ్ముంటే సభలో చర్చకు రండి: రాహుల్‌కు నిర్మల సవాల్

మొదటి పేజీ తరువాయి)

ఉన్నారు" అని నిర్మల పేర్కొన్నారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), ఈవీఎంల పనితీరుపై చర్చించేందుకు పార్లమెంటులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేద్దామని హోంమంత్రి అమిత్ షా సోమవారమే ప్రతిపాదించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. "సోషల్ మీడియాలో సవాళ్లు విసిరినంత ఉత్సాహం పార్లమెంటులో చర్చకు ఎందుకు చూపించడం లేదు?" అని ఆమె ప్రశ్నించారు.ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు సభ నుంచి వాకౌట్ చేస్తున్నారని నిర్మలా సీతారామన్ ఆరోపించారు. "సమాధానాలు డిమాండ్ చేసేటప్పుడు, వాటిని వినే బాధ్యత కూడా ఉంటుంది. ఎన్నోసార్లు మీరు, మీ పార్టీ సభ్యులు ప్రభుత్వం స్పందిస్తున్న సమయంలోనే సభ నుంచి వాకౌట్ చేశారు. అలాంటప్పుడు చర్చకు అంత ఆసక్తిగా ఉన్నామని ఎలా చెప్పుకుంటారు?" అని ఆమె నిలదీశారు.ప్రతిపక్షాల ఆందోళనలతో పార్లమెంట్ సమావేశాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతున్నాయని ఆమె విమర్శించారు. "మీకు చర్చపై నిజంగా అంత ఆసక్తి ఉంటే, ముందు పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగేలా సహకరించవచ్చు కదా?" అని ప్రశ్నించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నివాసంలో నిర్వహించిన "మాక్ పార్లమెంట్" కార్యక్రమాన్ని కూడా ఆమె తప్పుబట్టారు. అది "మాక్ పార్లమెంట్" కన్నా "పార్లమెంటును అపహాస్యం చేయడం"లా ఉందని ఎద్దేవా చేశారు.ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి మాట్లాడేవారు ముందుగా ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించాలని హితవు పలికారు. "'డరో మత్' (భయపడొద్దు) అని మీరు అంటుంటారు కదా. అలాంటప్పుడు వాస్తవాలతో, ఆధారాలతో సభకు రండి, విమర్శలను ఎదుర్కోండి, సమాధానాలు వినడానికి కూర్చోండి" అని రాహుల్ గాంధీకి నిర్మలా సీతారామన్ సవాల్ విసిరారు.

## తమిళ సినీ పరిశ్రమకు సీఎం విజయ్ ప్రభుత్వం గుడ్ న్యూస్.. ఇకపై రోజుకు 6 షోలు!

మొదటి పేజీ తరువాయి)

అనుమతి ఇస్తూ ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. సినిమా విడుదలైన మొదటి వారం రోజుల పాటు ఈ వెసులుబాటు ఉంటుందని ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ ఆరు షోలను ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున 2:30 గంటల మధ్య ప్రదర్శించుకోవచ్చని తెలిపింది.గత కొంతకాలంగా తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్, తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, తమిళనాడు థియేటర్ అండ్ మల్టీప్లెక్స్ ఓనర్స్ అసోసియేషన్ వంటి పలు సినీ సంఘాలు ప్రభుత్వానికి ఈ మేరకు విజ్ఞప్తి చేస్తున్నాయి. కొత్త సినిమాలకు తొలి వారంలో ప్రేక్షకుల ఆదరణ ఎక్కువగా ఉంటుందని, ఈ సమయంలో షోల సంఖ్య పెంచడం వల్ల పరిశ్రమకు, థియేటర్ల యజమానులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని వారు తమ అభ్యర్థనలో పేర్కొన్నారు. ఈ విజ్ఞప్తులపై సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరమే సీఎం జోసెఫ్ విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నారు.వాస్తవానికి 1957 నాటి తమిళనాడు సినిమాస్ (రెగ్యులేషన్) నిబంధనల ప్రకారం రాష్ట్రంలో రోజుకు కేవలం నాలుగు షోలకు మాత్రమే అనుమతి ఉండేది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సినీ పరిశ్రమ కోరిక మేరకు, కొత్త సినిమాలకు మొదటి వారం రోజులు, అలాగే పండుగలు, ప్రభుత్వ సెలవు దినాలు, శని, ఆదివారాల్లో రోజుకు ఐదు షోలకు అనుమతి ఇచ్చింది. ఇప్పుడు దానిని మరో అడుగు ముందుకు వేసి ఆరు షోలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.కొత్త సినిమాలకు విడుదలైన మొదటి వారం మాత్రమే కాకుండా, స్థానిక పండుగ రోజులు, ప్రభుత్వ సెలవులు, వారాంతాల్లో (శని, ఆదివారాలు) కూడా రోజుకు ఆరు షోలు ప్రదర్శించుకోవచ్చని ప్రభుత్వం తన ప్రకటనలో వివరించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంపై తమిళ సినీ పరిశ్రమకు చెందిన నిర్మాతలు, పంపిణీదారులు, థియేటర్ల యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి పరిశ్రమకు అండగా నిలిచినందుకు ముఖ్యమంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



# డ్రోన్లు, రోబోటిక్ టెక్నాలజీ, వ్యవసాయ యంత్రాల వినియోగంపై వివరించిన విద్యార్థినులు

**కీతవారిగూడెం, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామంలో గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏలూరులోని సీహెచ్ఎస్డీ సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం, పంటలకు పురుగుమందులు, ఎరువుల పిచికారీలో వాటి ఉపయోగాలు, రోబోటిక్ సాంకేతికత ద్వారా వ్యవసాయ పనులను వేగంగా పూర్తి చేసే విధానాలను రైతులకు వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో కూలీల ఖర్చులు, సమయం, శ్రమ తగ్గడంతో పాటు వ్యవసాయ పెట్టుబడి వ్యయాన్ని నియంత్రించి దిగుబడి, ఆదాయం పెంచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ట్రాక్టర్, వరి నాటే యంత్రం, మిశ్రమ పంటకోత యంత్రం, పవర్ వీడర్, రోటావేటర్ వంటి ఆధునిక వ్యవసాయ పరికరాల పనితీరు, ప్రయోజనాలను వివరించారు. వీటి ద్వారా దుక్కి దున్నడం, వరి నాట్లు వేయడం, కలుపు తొలగించడం, పంట కోత వంటి పనులను తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో పూర్తి చేసుకోవచ్చని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ బీఎస్సీ విద్యార్థినులు ఎం. నవ్యశ్రీ, ఐ. సత్యజ్యోతి, పి. హేమలత, వై. సౌమ్య, వై. మనీషా పాల్గొని రైతులకు వివరించారు. రైతులు నర్సింగ్, సతీష్, వేల్పుల సైదులు, ఎస్.కె. నాగులు, మీరా, గుడేపు అశోక్, దొంతగాని అంజయ్య, గుడేపు లక్ష్మీనారాయణ, ఎన్. నరసింహారావు, గుండూరి రాఘవయ్య, దాసరి సైదులు, బడేటి వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# గోదాంలలో బియ్యం నిల్వలు, నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- **ఆరు బఫర్ గోదాంల హమాలీలకు లేబర్ కార్డులు అందేలా చర్యలు**

**సూర్యాపేట, నవంబర్ 04 (ప్రజానేస్తం జ్వాల):**

గోదాంలలో బియ్యం నిల్వలు, నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కోదాడ సమీపంలోని బాలాజీనగర్ ఎస్డబ్ల్యూసీ గోదాంను కలెక్టర్, జిల్లా ఎస్పీ కె. నరసింహతో కలిసి సందర్శించి తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా గోదాంలోని బియ్యం నిల్వలు, నిర్వహణ తీరును పరిశీలించారు. స్టాక్ రికార్డులను తనిఖీ చేయడంతో పాటు బియ్యం నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షలు చేయించారు. పరీక్ష ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.పేదలకు పంపిణీ చేసే సన్న బియ్యాన్ని జాగ్రత్తగా నిల్వ చేయాలని కలెక్టర్ సూచించారు. బియ్యం నాణ్యత విషయంలో రాజీ పడకూడదని గోదాం మేనేజర్, టెక్నికల్ అసిస్టెంట్లకు స్పష్టం చేశారు. నిల్వ విధానం, భద్రతా ప్రమాణాలు, ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ (ఎఫ్ఐఎఫ్ఓ) పద్ధతిని తప్పనిసరిగా పాటించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

**హమాలీలకు లేబర్ కార్డులు**

అనంతరం గోదాంలో పనిచేస్తున్న హమాలీలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. లేబర్ కార్డులు మంజూరు చేయించాలని హమాలీలు కోరగా, స్పందించిన కలెక్టర్ సంబంధిత లేబర్ అధికారితో మాట్లాడారు. జిల్లాలోని ఆరు బఫర్ గోదాంలలో పనిచేస్తున్న హమాలీలందరికీ లేబర్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారి ఇతర సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తహసీల్దార్ సంతోష్ కిరణ్, ఎస్డబ్ల్యూసీ మేనేజర్ సందీప్, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్ రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై బీఆర్ఎస్వీ ఫిర్యాదు

**నారాయణపురం, నవంబర్ 04 (ప్రజానేస్తం జ్వాల):**

మునుగోడు నియోజకవర్గంలోని నారాయణపురం మండలంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్వీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేష్ తహసీల్దార్కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ను కలిసి వినతిపత్రం అందజేశారు.కొంతమంది అర్హత లేనివారు నకిలీ పత్రాలు, తప్పుడు సమాచారంతో ఓటరు నమోదుకు దరఖాస్తు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. సరైన విచారణ, పత్రాల ధృవీకరణ లేకుండానే దరఖాస్తులు ఆమోదిస్తున్నారనే ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో బీఎల్ఓల ద్వారా క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హత లేని దరఖాస్తులను తిరస్కరించాలని కోరారు. అక్రమాలకు పాల్పడినట్లు తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన వారికే ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని నలపరాజు రమేష్ కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు అడేపు సురేష్ కుమార్, తిరుమలేష్, గంగాదేవి స్వామి, గవ్వల సందీప్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

**సూర్యాపేట, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, విద్యాబోధన ప్రమాణాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. ఆకుపాముల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, వంటగదిని పరిశీలించారు. మధ్యాహ్న భోజన తయారీ, నిర్వహణ తీరును సమీక్షించారు.అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, విద్యా ప్రమాణాలు, పరీక్షల సన్నద్ధత గురించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలోని సమస్యలు, అవసరమైన మౌలిక సదుపాయాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి

పాఠశాలల తనిఖీల్లో భాగంగా ఫైనల్ ఇన్స్పెక్షన్ బృందంతో సమావేశమైన కలెక్టర్ విద్యాబోధన నాణ్యతపై పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, లెర్నింగ్ అవుట్కమ్స్ ఆధారంగా పాఠాలు బోధిస్తున్న తీరును పరిశీలించాలని ఆదేశించారు.టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగం, లెసన్ ప్లాన్లు, ఇయర్ ప్లాన్లు, టీచింగ్ డైరీల నిర్వహణను తనిఖీ చేయాలని సూచించారు. వర్క్షీట్ల ద్వారా విద్యార్థులకు నిరంతర అభ్యాసం కల్పించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల స్టాఫ్ రూమ్ పైకప్పు శిథిలావస్థకు చేరి స్లాబ్ దెబ్బతిన్న విషయాన్ని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై ఇప్పటికే ఎంపీడీఓకు దరఖాస్తు చేసినట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.



## విద్యుత్ షాక్‌తో ఆవు మృతి -- రైతు కుటుంబానికి ఆర్థిక నష్టం

**గూడూరు, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



పడమటి తండా గ్రామానికి చెందిన భూక్య వీరన్న కి చెందిన ఆవు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఈ ఘటనతో బాధిత కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఆవు మృతి చెందడంతో కుటుంబానికి ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లింది. జీవనాధారంగా ఉన్న పశువును కోల్పోవడంతో బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి ఘటనపై విచారణ జరిపి, బాధిత కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## అనుమతులు లేని లక్కీ డ్రాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- **ప్రజల కష్టార్జితాన్ని దోచుకుంటే కేసులు నమోదు చేస్తాం: ఎస్పీ కె. నరసింహా**

**సూర్యాపేట, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**




ప్రభుత్వ అనుమతులు లేకుండా లక్కీ డ్రాలు, అదృష్ట పథకాల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయడం చట్టవిరుద్ధమని జిల్లా ఎస్పీ కె. నరసింహా, ఐపీఎస్ హెచ్చరించారు. తక్కువ మొత్తంలో డబ్బులు చెల్లిస్తే కార్లు, ద్విచక్ర వాహనాలు, బంగారు ఆభరణాలు వంటి విలువైన బహుమతులు వస్తాయని ఆశ చూపి ప్రజలను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇలాంటి అక్రమ పథకాల ద్వారా ప్రజల కష్టార్జితాన్ని దోచుకోవడం సామాజిక, ఆర్థిక నేరమని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా లక్కీ డ్రాలు, ప్రైజ్ చిట్స్ నిర్వహిస్తే సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రజలు సోషల్ మీడియా, వాట్సాప్‌లలో వచ్చే ఆకర్షణీయమైన లక్కీ డ్రా ప్రకటనలను నమ్మి డబ్బులు చెల్లించవద్దని సూచించారు. అక్రమ పథకాల సమాచారం తెలిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు తెలియజేయాలని, మోసపోయిన వారు ఫిర్యాదు చేయాలని ఎస్పీ కోరారు. ప్రజల ఆర్థిక భద్రతకు భంగం కలిగించే అక్రమ కార్యకలాపాలను ఉపేక్షించబోమని హెచ్చరించారు.

## రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు తావివ్వొద్దు

**వేలేరు, నవంబర్ (ప్రజానేస్తం జ్వాల):**



వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగు రేషన్ షాపులను సర్పంచ్ బిల్లా యాదగిరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలోని 2,250 రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని సక్రమంగా అందించాలని డీలర్లను ఆదేశించారు.బియ్యం తరుగు పేరుతో కార్డుదారులకు తక్కువ బియ్యం ఇవ్వకూడదని, ప్రతి కార్డుదారునికి పూర్తి పరిమాణంలో బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. రేషన్ షాపులను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు తూనికలు, కొలతల్లో ఎలాంటి తేడాలు లేకుండా చూడాలన్నారు. పంపిణీలో అక్రమాలకు పాల్పడినా, అవకతవకలు జరిగినా సంబంధిత డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, వార్డు సభ్యులు లక్ష్మీనారాయణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను బాధిత రైతులకు తక్షణ పరిహారం అందించాలి

- **హుజూర్‌నగర్‌లో పంట నష్టాన్ని మంత్రి ఉత్తమ్ పరిశీలించాలి: టీడీపీ నాయకుడు మండవ వెంకటేశ్వర్లు గౌడ్**

**హుజూర్‌నగర్, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



తుఫాన్ల ప్రభావంతో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో వరి పంట దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని టీడీపీ నియోజకవర్గ నాయకుడు మండవ వెంకటేశ్వర్లు గౌడ్ డిమాండ్ చేశారు.భారీ వర్షాలకు వరి పంట నేలకొరిగి నీటిలో, బురదలో కూరుకుపోయిందని తెలిపారు. స్థానిక మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించాలని, అధికారులతో సమగ్ర సర్వే చేయించి బాధిత రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని కోరారు.ఎల్హెచ్పీఎస్ జాతీయ నాయకుడు బానోతు వెంకటరాం నాయక్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమ్మగాని వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ హుజూర్‌నగర్‌ను కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించి రైతులకు తక్షణ ఆర్థిక సహాయం, పంట బీమా ప్రయోజనాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరావు నాయక్, జక్కుల కిరణ్ యాదవ్, బత్తిని జానకిరాముల గౌడ్, ఎం. వెంకటరాజు, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి ఆర్థిక సాయం.

**హుజూర్‌నగర్, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



హుజూర్‌నగర్ పట్టణంలోని 15వ వార్డుకు చెందిన ఇటీవల మృతి చెందిన కుడితొట్టి అబ్రహం కుటుంబానికి బీజేపీ రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆర్థిక సహాయం అందించారు.గతంలో అబ్రహం కుటుంబాన్ని పరామర్శించిన సైదిరెడ్డి, వారి దీనస్థితిని తెలుసుకుని అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా తన తరఫున బీజేపీ పట్టణ నాయకుల ద్వారా కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్, జిల్లా నాయకుడు బెల్లంకొండ నరేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి రాళ్లబండి రామారావు, దళిత మోర్చా నాయకుడు మేళ్లచెరువు లక్ష్మణ్, పట్టణ ఉపాధ్యక్షుడు పైడిమర్రి విజయ్, యువ మోర్చా అధ్యక్షుడు బల్వంత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

## మున్సిపల్ సమావేశాల్లో అనధికార వ్యక్తుల జోక్యం తగదు

**హుజూర్‌నగర్, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



మున్సిపల్ సమావేశాలు, అధికారిక చర్చలు, అభివృద్ధి కార్యక్రమాల నిర్ణయాల్లో అనధికార వ్యక్తుల జోక్యాన్ని నివారించి, ఎన్నికైన కౌన్సిలర్లు మాత్రమే పాల్గొనేలా నిబంధనలు అమలు చేయాలని 11వ వార్డు కౌన్సిలర్ పులిచింతల వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.మున్సిపల్ సమావేశాల్లో కౌన్సిలర్ల కుటుంబ సభ్యులు, ఇతర అనధికార వ్యక్తులు పాల్గొనడం అధికారిక ప్రొటోకాల్‌కు విరుద్ధమని, దీనివల్ల పరిపాలనా వ్యవహారాల గోప్యతకు భంగం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ల ద్వారా ఎన్నికైన మహిళా కౌన్సిలర్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులు సమావేశాలకు హాజరుకావడం మహిళా సాధికారత లక్ష్యానికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## మహిళా కండక్టర్ మృతికి నిరసనగా మధిర ఆర్టీసీ కార్మికుల విధుల నిలిపివేత

**మధిర, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



విధి నిర్వహణలో ప్రయాణికురాలి దాడికి గురై తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన టీజీఎస్ ఆర్టీసీ మహిళా కండక్టర్ ప్రవళిక మృతికి నిరసనగా మధిర ఆర్టీసీ డిపో కార్మికులు విధులు నిలిపివేసి సంతాపం ప్రకటించారు.అక్టోబర్ 25న విధుల్లో ఉన్న కండక్టర్ ప్రవళికపై ఓ మహిళా ప్రయాణికురాలు దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నవంబర్ 3వ తేదీ రాత్రి 10 గంటలకు మృతి చెందారు.ప్రవళిక మృతికి సంతాపంగా ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో మధిర డిపో కార్మికులు విధులు నిలిపివేసి నివాళులర్పించారు.

## నాణ్యత లేని కల్వర్టు నిర్మాణం.. విచారణకు కాంగ్రెస్ డిమాండ్

**నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



ఆసిఫాబాద్ మండలం కొమ్ముగూడ ఎస్సీ కాలనీ సమీపంలో నిర్మించిన కల్వర్టు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా విస్మరించారని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి (ఎస్సీ సెల్) ఇగరపు సంతోష్ ఆరోపించారు. వర్షాల సాకుతో హడావుడిగా పనులు పూర్తి చేయడంతో నిర్మాణంలో లోపాలు తలెత్తాయని విమర్శించారు. ఫ్లోరింగ్ పటిష్ఠంగా లేకపోవడంతో నీరు నిలిచి, మట్టి పేరుకుపోతున్నట్లు తెలిపారు. ప్రజాధనంతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలివ్వడం ఆందోళనకరమన్నారు. సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్మాణ నాణ్యతను పరిశీలించి, లోపాలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి పోరాట కార్యాచరణ

**హైదరాబాద్, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల సమస్యల పరిష్కారం కోసం పోరాట కార్యాచరణ రూపొందించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. బుధవారం హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌లోని హోటల్ శుభంలో రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అధ్యక్షతన ఆరు గంటల పాటు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, కార్యదర్శి రామనారాయణ, యూనియన్ జాతీయ నాయకుడు కుంజేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలసాని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోలా నాగేశ్వరరావు, బంటు కృష్ణ తదితరులు హాజరయ్యారు.సమావేశంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల మంజూరుపై విస్తృతంగా చర్చించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణతో ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించారు. అక్రిడిటేషన్ కార్డుల మంజూరు ప్రక్రియపై సమావేశం సంతృప్తి వ్యక్తం చేసింది. కార్యదర్శి సమర్పించిన నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించి హర్షం వ్యక్తం చేశారు.

## ట్రాఫిక్‌కు ఆటోలతో అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవు!

- **ఆటో డ్రైవర్లకు ఎస్ఐ నరేష్ హెచ్చరిక.. నిబంధనలు పాటించాలని సూచన**

**హుజూర్ నగర్, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



హుజూర్ నగర్ పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పోలీసులు దృష్టి సారించారు. బస్టాండ్ ఎదుట, ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఆటోలు నిలిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ నరేష్ ఆటో డ్రైవర్లను హెచ్చరించారు.స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఇష్టానుసారంగా ఆటోలు నిలిపి ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించరాదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. పట్టణంలోని ఆటోల వివరాలను సేకరించి, ఆటోలకు ప్రత్యేక నంబర్లు కేటాయించే చర్యలు చేపడతామని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులకు ఆటో డ్రైవర్లు సహకరించాలని ఎస్ఐ నరేష్ కోరారు.

# జాన్‌పహాడ్ దర్గాలో జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రత్యేక పూజలు

**పాలకవీడు, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



పాలకవీడు మండలంలోని ప్రసిద్ధ జాన్‌పహాడ్ దర్గాలో జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్ వాహనానికి హుజూర్‌నగర్ నియోజకవర్గ జనసేన పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ సరికొప్పుల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు విజయం సాధించాలని ప్రార్థించారు.అనంతరం గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్ ద్వారా పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. స్థానిక పోలీస్ స్టేషన్, ప్రభుత్వ పాఠశాలలో అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదుపై వివరించారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. యువత, పట్టభద్రుల సమస్యలపై అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నాయిని మధు, శ్రీనివాస్ రెడ్డి, షేక్ రషీద్, నాగచారి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవ యువతులపై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలి

**సూర్యాపేట, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



హైదరాబాద్ అల్మాస్‌గూడ, మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల క్రైస్తవ యువతులపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్ డిమాండ్ చేశారు.బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దాడికి సంబంధించిన ఫొటోలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై దాడులు అమానుషమని, బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఘటనపై తక్షణమే కేసు నమోదు చేసి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని, మానవ హక్కుల కమిషన్‌ను కూడా ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవ. డా. జలగం జేమ్స్, ధరావత్ లాకు నాయక్, జాటోత్ డేవిడ్ నాయక్, రెవ. పంది మార్క్, పాస్టర్ వి. ఫిలిప్, టి. కిరణ్ బాబు, పెరుమాళ్ల ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హుజూర్‌నగర్ డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో లోపాలు వెంటనే సరిచేయాలి

**సూర్యాపేట, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



హుజూర్‌నగర్ రామస్వామిగుట్ట వద్ద నిర్మిస్తున్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయంలో గుర్తించిన లోపాలను వెంటనే సరిచేసి, మిగిలిన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఎస్పీ కే. నరసింహతో కలిసి మోడల్ కాలనీలోని ప్రతి బ్లాక్‌ను పరిశీలించారు. ఇళ్లలోని లోపాలను సరిచేయడంతో పాటు డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## టీపీటీఎఫ్ నూతన మండల కార్యవర్గం ఎన్నిక

**భీమదేవరపల్లి, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రామంచ భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా కాలేసి కొమురయ్య ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షుడిగా పూధారి రమేష్, కోశాధికారిగా అనిల్ ప్రతాప్, కార్యదర్శిగా ఏ. శంకర్ రెడ్డి ఎన్నికయ్యారు.



ఎన్నికల పరిశీలకులుగా ఎప్పా కుమారస్వామి, జిల్లా అధ్యక్షుడు బత్తిని రామాంజనేయులు, ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు బి. సారయ్య నాయక్ వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. తమకు బాధ్యతలు అప్పగించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నర్సంపేట లక్ష్మీపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం: టాటా ఏసీ ఢీకొని విద్యార్థి దుర్మరణం, మరొకరి పరిస్థితి విషమం!

**హనుమకొండ, నవంబర్ 04 (ప్రజానేస్తం జ్వాల):**



వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్ష్మీపల్లి శివారు ప్రధాన రహదారిపై బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కాలేజీ విద్యార్థులు ఇద్దరు ద్విచక్ర వాహనంపై నర్సంపేట నుంచి వరంగల్ వైపు వెళ్తుండగా, ఎదురుగా అతివేగంగా దూసుకొచ్చిన టాటా ఏసీ వాహనం వారి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ తీవ్ర ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న విద్యార్థి అక్కడికక్కడే దుర్మరణం చెందగా, వెనుక కూర్చున్న మరో విద్యార్థి తీవ్ర గాయాలపాలై కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, క్షతగాత్రుడిని ప్రాథమిక చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## విద్యార్థినికి వేధింపులు.. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**గరిడేపల్లి, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



విద్యార్థుల భద్రతకు బాధ్యత వహించాల్సిన పాఠశాల యాజమాన్యమే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీటీసీ చింతిరాల నాగయ్య ప్రశ్నించారు. పట్టణంలోని కాకతీయ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థినికి సంబంధించిన ఘటనపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థినితో మాట్లాడేందుకు ఉపాధ్యాయులు ప్రోత్సహించి, అనంతరం ఆమెను భయభ్రాంతులకు గురిచేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. గతంలోనూ పాఠశాలలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని, ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు తమ సమస్యలను బయటపెట్టలేక టీసీలు తీసుకొని వెళ్లిపోయిన సందర్భాలున్నాయని ఆరోపించారు. తాజాగా జరిగిన ఘటన బయటకు రాకుండా విద్యార్థినికి టీసీ ఇచ్చి పంపిస్తామని చెప్పి భయపెట్టినట్లు పేర్కొన్నారు.ఈ ఘటనపై విద్యాశాఖ, పోలీసు అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని నాగయ్య డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యంతో పాటు కాకి శ్రీధర్ గౌడ్ పాత్రపైనా విచారణ జరిపి, ఈ వ్యవహారంలో ప్రోత్సహించిన, సహకరించిన వారిపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థినికి న్యాయం చేయడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## గ్రామ పరిశుభ్రతకు బండతండా పంచాయతీ ప్రత్యేక చర్యలు

**బండతండా, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బండతండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రహదారుల వెంట, బహిరంగ ప్రదేశాల్లో పెరిగిన చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాలోతు అరుణ నాగరాజు, ఉపసర్పంచ్ రాజశ్రీ, వార్డు సభ్యుడు మంగ సంపత్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని వారు కోరారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



# గ్రేటర్ వరంగల్ యూజీడీ పనులపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష!

**హనుమకొండ, నవంబర్ 04 (ప్రజానేస్తం జ్వాల):**

గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర సాంకేతిక అంశాలపై కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డి. తార బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బల్దియా కమిషనర్ తి. వెంకన్న మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రస్తుత ఆదాయ వనరులు, ప్రాజెక్టుల నిర్వహణకు స్వంత ఆదాయాన్ని మరింతగా సమకూర్చుకునేందుకు ఉన్న అవకాశాలను కేంద్ర బృందానికి సమగ్రంగా వివరించారు. ప్రాజెక్టు డీపీఆర్‌లోని సాంకేతిక అంశాలను చర్చించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షలో బల్దియా ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ రవికుమార్ తదితర సాంకేతిక ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



# విధుల సమయంలో సబ్‌స్టేషన్‌లో మద్యం సేవనం: నలుగురు సిబ్బంది సస్పెండ్, ముగ్గురు ఉద్యోగం నుంచి తొలగింపు!

**హనుమకొండ, నవంబర్ 04 (ప్రజానేస్తం జ్వాల):**

వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం మంగళవారిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధి నిర్వహణ సమయంలో మద్యం సేవించిన వ్యవహారంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తీవ్రమైన క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. అక్టోబర్ 29న జరిగిన ఈ అసాంఘిక ఘటనపై శాఖాపరమైన విజిలెన్స్ బృందం విచారణ జరిపి పూర్తిస్థాయి నివేదికను సమర్పించింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు రెగ్యులర్ సిబ్బందిని విధుల్లోంచి తక్షణమే సస్పెండ్ చేయగా, ముగ్గురు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగించారు. అలాగే మరో ఉద్యోగికి టెర్మినేషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ మంగమ్మ అధికారికంగా ధ్రువీకరించారు. విధి నిర్వహణలో సిబ్బంది ఇటువంటి అనుచిత ప్రవర్తనలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



# వరద విపత్తుల వేళ బాధితులకు ఆహార పొట్లాలు చేరవేసేందుకు డ్రోన్: హయగ్రీవాచారి మైదానంలో అగ్నిమాపక శాఖ ట్రయల్స్!

**హనుమకొండ, నవంబర్ 04 (ప్రజానేస్తం జ్వాల):**

భారీ వర్షాలు, ఆకస్మిక వరదల సమయంలో లోతట్టు కాలనీలు జలమయమై బాధితులు చిక్కుకుపోతే.. అత్యవసరంగా ఆహార పొట్లాలు, మందులు అందించేందుకు హనుమకొండ అగ్నిమాపక శాఖ అత్యాధునిక రెస్క్యూ డ్రోన్‌ను సిద్ధం చేసింది. సుమారు రూ.7 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ఈ అత్యాధునిక డ్రోన్ దాదాపు 10 కిలోల బరువు గల ఆహార పదార్థాలను గగనతలం గుండా సురక్షితంగా చేరవేయగలదు. బుధవారం హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో ఫైర్ సిబ్బంది ఈ డ్రోన్ పనితీరును ప్రయోగాత్మకంగా పరీక్షించి విజయవంతమైన ట్రయల్ రన్ నిర్వహించారు. విపత్తుల సమయంలో వేగంగా సహాయక చర్యలు చేపట్టేందుకు ఈ డ్రోన్ సాంకేతికత ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ అధికారులు మహేశ్వర్, రాజ్ కుమార్, సతీష్, రత్నాకర్ పాల్గొన్నారు.



# డిసెంబర్ 15 నుంచి ఆశా వర్కర్ల రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె: డీఎంహెచ్‌వో, డీఆర్వోలకు సమ్మె నోటీసు!

**హనుమకొండ, నవంబర్ 04 (ప్రజానేస్తం జ్వాల):**

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ఆశా కార్యకర్తలు ప్రకటించారు. ఈ మేరకు సీఐటీయూ (జఒఖ) జిల్లా కార్యదర్శి రమేష్ నేతృత్వంలో ప్రతినిధి బృందం హనుమకొండ డీఎంహెచ్‌వోతో పాటు కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో రాజేష్ కుమార్‌కు అధికారికంగా సమ్మె నోటీసులు అందజేశారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల స్థిర వేతనం (ఫిక్స్‌డ్ పే) చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని మరియు విపరీతంగా పెరిగిన పని భారాన్ని వెంటనే తగ్గించాలని వారు ప్రధానంగా డిమాండ్ చేశారు. అలాగే ఈ పోరాటంలో భాగంగా నవంబర్ 16వ తేదీన తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జిల్లాలోని ఆశా కార్యకర్తలందరూ ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని రమేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.




# నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం.. ఆటో డ్రైవర్ రాము!

- **ఆటోలో మరిచిపోయిన బ్యాగ్‌ను విలువైన వస్తువులతో సహా పోలీసులకు అప్పగింత**
- **రాము నిజాయితీని అభినందించి శాలువాతో సత్కరించిన ఎస్ఐ నరేష్**

**హుజూర్‌నగర్,నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**

నిజాయితీకి మారుపేరుగా నిలిచి అందరి ప్రశంసలు అందుకున్నాడు ఓ ఆటో డ్రైవర్. ప్రయాణికురాలు ఆటోలో మరిచిపోయిన హ్యాండ్ బ్యాగ్‌ను గుర్తించి, అందులోని విలువైన వస్తువులతో సహా పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు.సూర్యాపేట జిల్లా తమ్మారం గ్రామానికి చెందిన అఖిల హుజూర్‌నగర్‌కు ఆటోలో ప్రయాణించి ఆసుపత్రికి వెళ్లే క్రమంలో తన హ్యాండ్ బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయింది. కొద్దిసేపటి తర్వాత బ్యాగ్‌ను గమనించిన ఆటో డ్రైవర్ రాము, అందులో విలువైన వస్తువులు ఉన్నట్లు గుర్తించాడు. వెంటనే స్పందించి బ్యాగ్‌ను హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఎస్ఐ నరేష్‌కు అప్పగించాడు.అనంతరం పోలీసులు బాధితురాలి తండ్రికి బ్యాగ్‌ను అప్పగించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్ రామును ఎస్ఐ నరేష్ అభినందించి శాలువాతో సత్కరించారు.నిజాయితీ, మానవత్వం సమాజానికి ఆదర్శమని, రాము వంటి వ్యక్తులు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తారని పలువురు ప్రశంసించారు.




## రాజ్యాంగ పరిరక్షణకు గ్రామస్థాయి కమిటీల ఏర్పాటు

- **ముస్తాఫాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మాడుగుల సంపత్ కుమార్ ఎన్నిక**

**భీమదేవరపల్లి, నవంబర్ 04 (ప్రజానేస్తం జ్వాల):**



భారత రాజ్యాంగ పరిరక్షణతో పాటు ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు గ్రామస్థాయి నుంచి కమిటీలను బలోపేతం చేయాలని భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముస్తాఫాపూర్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా మాడుగుల సంపత్ కుమార్‌ను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నవంబర్ 26ను పురస్కరించుకుని హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్వహించనున్న రాజ్యాంగ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేడుకలకు అంబేద్కర్‌వాదులు, రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డ్యాగల సారయ్య, భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక మండల అధ్యక్షుడు ఉప్పుల కుమారస్వామి, మాజీ వైస్ ఎంపీపీ మాడుగుల ఎజ్రా, కడారి శ్రీనివాస్, మాడుగుల ప్రభుదాస్, గంగారపు రాజయ్య, ఇల్లందుల కిషోర్, రెంటాల స్వామి, ఎడ్ల సుధాకర్, గొట్టే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు, వృద్ధులకు సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరం

**భీమదేవరపల్లి, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



దివ్యాంగులు, వృద్ధులకు సహాయ ఉపకరణాల పంపిణీ కోసం ఈ నెల 19న భీమదేవరపల్లి మండలం ముల్కనూరు రైతువేదికలో ఎంపిక శిబిరం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో అలింకో సంస్థ సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, వాకర్లు, చేతికర్రలు, కృత్రిమ అవయవాల కోసం అర్హులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులు, వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కుమురం భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**ఆసిఫాబాద్, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):**



జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన కుమురం భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పిలుపునిచ్చారు. జిల్లా రాజ్ గోండ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆసిఫాబాద్‌లో నిర్వహించిన కుమురం భీం స్మారక జెండా ఆవిష్కరణ, వర్ధంతి వారోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు. అనంతరం కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయడమే కుమురం భీంకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, జిల్లా రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

**సూర్యాపేట, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



నల్గొండలో నవంబర్ 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. నవంబర్ 15న రెండు లక్షల మంది రైతులతో భారీ ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని, తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించి రూ.50 వేల కోట్ల కరువు సహాయం అందించాలని డిమాండ్ చేశారు.మహాసభల ప్రచారంలో భాగంగా బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 36 ట్రాక్టర్లతో భారీ ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీ ప్రజలను ఆకట్టుకుంది.

## సమ్మె సమయంలోనూ టీకా సేవలకు అంతరాయం కలగొద్దు

**భీమదేవరపల్లి, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమ్మె కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. బుధవారం భీమదేవరపల్లి మండలంలోని వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలు, ఔషధాలు, వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించారు.సమ్మె నేపథ్యంలో ఏఎన్ఎంలు విధులకు దూరంగా ఉన్నప్పటికీ చిన్నారులు, గర్భిణులకు టీకా కార్యక్రమాలు యథావిధిగా కొనసాగించాలని ఆదేశించారు. పీహెచ్‌సీలో నిర్వహించిన టీకా కార్యక్రమంలో 11 మంది లబ్ధిదారులకు 21 డోసులు అందించినట్లు సిబ్బంది తెలిపారు. ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీఎంహెచ్ఓ సూచించారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

## లంచం తీసుకుంటుండగా బజార్హత్నూర్ ఎస్సైని పట్టుకున్న ఏసీబీ అధికారులు

**ఆదిలాబాద్, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



ఆదిలాబాద్ జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన దాడిలో బజార్హత్నూర్ ఎస్సై రమేశ్ పట్టుబడ్డారు. ఓ కేసు విషయంలో అనుకూలంగా వ్యవహరించేందుకు బాధితుడిని లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆయనను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.బజార్హత్నూర్ మండలానికి సంబంధించిన ఓ కేసు విషయంలో ఎస్సై రమేశ్ రూ.40 వేలు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. లంచం ఇచ్చేందుకు ఇష్టపడని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అధికారులు ముందస్తు ప్రణాళికతో దాడి నిర్వహించి, నగదు తీసుకుంటున్న సమయంలో ఎస్సైను అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు వెల్లడించారు.

## నేరేడుచర్లలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం

**నేరేడుచర్ల, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



మహిళల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించే లక్ష్యంతో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, ఎన్‌బీఐ ఫౌండేషన్ సౌజన్యంతో, లైఫ్ సీబీఓ సహకారంతో సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలోని రామ్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 24 మంది మహిళలు పాల్గొనగా, వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యానికి సంబంధించిన పలు సూచనలు, సలహాలు అందించారు.శిబిరంలో మహిళల ఆరోగ్య పరిస్థితులను వైద్య సిబ్బంది పరిశీలించి, సాధారణ ఆరోగ్య సమస్యలు, వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించారు. అనారోగ్య లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందవచ్చని వివరించారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ కౌన్సిలర్ ఎంజమూరి వెంకటమ్మ ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, కుటుంబ బాధ్యతలతోపాటు వ్యక్తిగత ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మహిత స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న ఆరోగ్య సేవా కార్యక్రమాలను అభినందించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిణి, జిల్లా కోఆర్డినేటర్ సయ్యద్ సజ్జాద్ అలీ, వైద్య సిబ్బంది, సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి

**సూర్యాపేట, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



మోతె మండలం అన్నారిగూడెం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యురాలు, మైనార్టీ నాయకురాలు షేక్ రసూల్ ఫాతిమా కుమారుడు నాగుల మీరా వివాహం సందర్భంగా నిర్వహించిన కందూరు వేడుకల్లో మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ అర్వపల్లి గణేష్ గౌడ్, మాజీ సర్పంచ్ సీత శ్రీనివాస్ యాదవ్, గుడిపూడి వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు ఏలూరి కృష్ణ, అన్నం అశోక్, కాంగ్రెస్ నాయకులు ఆలకుంట ముత్తయ్య, నాయిని సతీష్, అంబాల వెంకన్న, నాయిని పురుషోత్తం, గంజి సురేష్, నాయిని ఉపేందర్, షేక్ రహమత్, బెనర్జీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై మేధావుల సంగోష్టి

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**

సిటిజన్ ఫర్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలోని సంఘమిత్ర కాలేజీలో అడ్వకేట్ చీర్ల అశోక్ రెడ్డి అధ్యక్షతన మేధావుల సంగోష్టి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, చందుపట్ల కీర్తి రెడ్డి, తిరుపతి రెడ్డి, జనార్ధన్, రాములు తదితరులు పాల్గొని ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా ప్రక్షాళనపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలోని తప్పులను సరిదిద్దే అవకాశం ఉందన్నారు. మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓట్లను గుర్తించి నిబంధనల ప్రకారం సరిదిద్దడం ఈ ప్రక్రియలో భాగమని వివరించారు.అదే సమయంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూడటం ముఖ్యమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్నికల సంఘం చేపట్టే కార్యక్రమాలపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు మేధావులు, విద్యావంతులు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటర్ల జాబితా సవరణ విధానం గురించి ప్రజలకు వివరించాలని సూచించారు.ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, రాజ్యాంగ విలువలు, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏడునూతుల నిషీధర్ రెడ్డి, వెన్నంపల్లి పాపన్న, ఎరుకల గణపతి, చల్లా నారాయణరెడ్డి, డాక్టర్లు, ప్రైవేట్ ఉపాధ్యాయులు, న్యాయవాదులు, సింగరేణి ఉద్యోగులు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.



# నవంబర్ 7 నుంచి 20 వరకు టీటీడీ విశ్రాంత ఉద్యోగులకు శ్రీవారి ప్రసాదాల పంపిణీ

**తిరుపతి, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**




టీటీడీ విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ పింఛన్‌దారులకు శ్రీవారి లడ్డూ, వడ ప్రసాదాలను నవంబర్ 7 నుంచి 20వ తేదీ వరకు పంపిణీ చేయనున్నట్లు టీటీడీ ప్రకటించింది. తిరుపతిలోని టీటీడీ క్యాంటీన్ వద్ద ఉన్న కొత్త జాబిలి భవనంలో ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రసాదాల పంపిణీ జరుగుతుంది. పింఛన్‌దారులు తమ స్మార్ట్ కార్డు చూపించి ఒక పెద్ద లడ్డూ, ఒక వడ ప్రసాదం పొందవచ్చు.

పీపీఓ నంబర్ల వారీగా పంపిణీ వివరాలు:

- నవంబర్ 7: 164 నుంచి 3,250 వరకు.
- నవంబర్ 9 నుంచి 13 వరకు: 3,251 నుంచి 9,050 వరకు.
- నవంబర్ 16 నుంచి 19 వరకు: 9,051 నుంచి 12,550 వరకు.
- నవంబర్ 20: 12,551 నుంచి మిగిలిన పింఛన్‌దారులందరికీ.

విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ పింఛన్‌దారులు తమ పీపీఓ నంబర్లకు కేటాయించిన తేదీల్లో స్మార్ట్ కార్డుతో హాజరై శ్రీవారి ప్రసాదాలను స్వీకరించాలని టీటీడీ కోరింది.

# రాండాస్ తండాలో ఫ్లోరోసిస్ సమస్యపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ పర్యటన

**నల్లగొండ, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



గతంలో ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొన్న నాంపల్లి మండలంలోని రాండాస్ తండాను జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అన్వేష్ భట్టాచార్య సందర్శించారు. మిషన్ భగీరథ ద్వారా రక్షిత తాగునీటి సరఫరా, గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి గతంలో ఫ్లోరైడ్ నీటి వినియోగం వల్ల ఎదురైన ఆరోగ్య సమస్యలు, ప్రస్తుతం రక్షిత తాగునీరు అందుబాటులోకి వచ్చిన తర్వాత చోటుచేసుకున్న మార్పుల గురించి వివరాలు తెలుసుకున్నారు.ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ద్వారా ఫ్లోరైడ్ సమస్యను నియంత్రించడంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడవచ్చని డాక్టర్ అన్వేష్ భట్టాచార్య పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ ద్వారా అందుతున్న తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు.ఈ పర్యటనలో ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ అంజనేయులు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గీసుగొండ మండల కాంగ్రెస్ కమిటీల ప్రకటన

**గీసుగొండ, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**



కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ సంస్థాగత ఎన్నికలు--2026లో భాగంగా గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ పూర్తి కమిటీని ప్రకటించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయూబ్, మండల అధ్యక్షుడు దాడి శివ సంయుక్తంగా మండల, మహిళా కాంగ్రెస్, ఎస్సీ సెల్ కమిటీల వివరాలను వెల్లడించారు.మండల కాంగ్రెస్ కమిటీ: అధ్యక్షుడిగా దాడి శివ, ఉపాధ్యక్షులుగా జన్ను రమేష్, బాదావత్ రమేష్, నల్ల సురేష్, ప్రధాన కార్యదర్శులుగా నకినబోయిన నాగరాజు, కొమ్ము శ్రీకాంత్, చల్లా కృష్ణారెడ్డి, కార్యదర్శులుగా మారదోజు వేణు, కందారి సంతోష్, జల్లెల రవి, తుమ్మనపల్లి బాబురావు, కందికొండ రాజు, జూల రమేష్ నియమితులయ్యారు. కోశాధికారిగా కొల సునీల్, కార్యవర్గ సభ్యులుగా కౌడగాని సతీష్, ఎండీ హుస్సేన్, ఆగుల రాజు, సహింపు వెంకటేశ్వర్లు, భూక్య రాంబాబు, మర్రి రాజలింగం, గడ్డమీది రమేష్‌లను ఎంపిక చేశారు.మహిళా కాంగ్రెస్ కమిటీ: అధ్యక్షురాలిగా మాదాసి కళ్యాణి, ఉపాధ్యక్షులుగా మాడిశెట్టి సునీత, తుమ్మ నిర్మల జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా కొమ్ము సబిత, కార్యదర్శులుగా చిలంకురి లిల్లీ మేరీ, ఊరుగొండ అనిత, కోశాధికారిగా చేతరాశి అన్నపూర్ణ, కార్యవర్గ సభ్యులుగా మంద మల్లికాంబ, కొంగర అంబిక, పులిచేరి మంజులను నియమించారు.ఎస్సీ సెల్ కమిటీ: అధ్యక్షుడిగా కొమ్ముల వినయ్, ఉపాధ్యక్షులుగా కాయిత అఖిల్, కోట ప్రణయ్, ప్రధాన కార్యదర్శిగా మంద రాజు, కార్యదర్శులుగా డక్క కుమారస్వామి, కొంగర సారిబాబు, కోశాధికారిగా కొరవి రమేష్, కార్యవర్గ సభ్యులుగా జన్ను ప్రశాంత్, కుక్కముడి రాజేష్, నమిండ్ల కుమారస్వామి, పసునూటి శ్యాంసుందర్, వనపాకల సాంబయ్య, చిరుపూరి కోటి, గుండా లక్ష్మణ్, మంద సారంగంలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దాడి శివ మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు పార్టీ సంస్థాగత కార్యకలాపాలను గ్రామస్థాయికి విస్తరించేలా సమన్వయంతో పనిచేయాలని కోరారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## ఆర్టీసీ ఉద్యోగిని ప్రవళిక మృతిపై సంతాప సభ

**పరకాల, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**

మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన ఉద్యోగిని ప్రవళిక అకాల మరణం పట్ల ఎంప్లాయిస్ యూనియన్ కూటమి, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ బుధవారం పరకాల ఆర్టీసీ డిపో గేటు ఎదుట సంయుక్తంగా సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ యూనియన్ల నాయకులు, మహిళా కండక్టర్లు ప్రవళిక చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు సుధాకర్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులందరికీ తక్షణమే స్మార్ట్ కార్డులు అందించాలని కోరారు. ప్రవళిక మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీ కార్యదర్శి ఈ.ఆర్. ప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను సామర్థ్యానికి మించి ఎక్కించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయంతో పాటు అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీ డిపో అధ్యక్షుడు లౌడియా గోవర్ధన్ నాయక్, ఎంప్లాయిస్ నాయకులు మంద శ్రీనివాస్, బి.డి. స్వామి, ఎన్ఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆహా శ్రీను, డిపో అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి రఘువీర్, వివిధ యూనియన్ల ప్రతినిధులు, మహిళా కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## గంగారం ఉన్నత పాఠశాలలో ఘనంగా శకుంతలా దేవి 98వ జయంతి వేడుకలు

- విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంపొందించాలి: రాజారాం ప్రకాష్



**బిజినపల్లి, నవంబర్ 4 (ప్రజానేస్తం జ్వాల):**

ప్రపంచ ప్రఖ్యాత గణిత మేధావి, హ్యూమన్ కంప్యూటర్‌గా పేరుగాంచిన శకుంతలా దేవి 98వ జయంతి వేడుకలను బుధవారం బిజినపల్లి మండల పరిధిలోని గంగారం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్, ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ మాట్లాడుతూ.. శకుంతలా దేవి అసాధారణ గణిత ప్రతిభతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు. అత్యంత క్లిష్టమైన గణిత సమస్యలను సైతం అద్భుత వేగంతో పరిష్కరించి గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో చోటు సంపాదించుకున్నారని పేర్కొన్నారు.చిన్ననాటి నుంచే సంఖ్యలపై అసాధారణ పట్టు ప్రదర్శించిన ఆమె, తన ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారని గుర్తుచేశారు. గణితాన్ని సులభంగా అర్థం చేసుకునేలా పలు పుస్తకాలు రచించి, విద్యార్థుల్లో సంఖ్యల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు కృషి చేశారని అన్నారు. శకుంతలా దేవి జీవితం విద్యార్థులకు గొప్ప స్ఫూర్తిదాయకమని, ఆమెను ఆదర్శంగా తీసుకుని పట్టుదల, సాధనతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కందుకూరు అశోక్ కుమార్, కొములయ్య, శ్రీకాంత్ రెడ్డి, నందకిషోర్, ఊర్మిళ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.